

6

## చికిత్స జాప్యంపై నలుగురికి మెమోలు


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3 సంచిక -98 గురువారం17 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

- దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్




**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరు పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. అయినప్పటికీ.. ఈ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీసేలా ఉంటే వాటిని తొలగించాలనే గళాన్ని వినిపించే వాళ్లు మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. బెంగళూరులో ఇంటర్నే షనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేష న్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం

మిగతా2లో...

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది
- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు మిగతా2లో...



## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ



2లో

## 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే
- హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది?
- అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో

మిగతా2లో...

## ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

- ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం
- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



2లో



## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

- కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)

మిగతా2లో...



## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

- కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం
- 51 లక్షల మంది లబ్ధి పొందే చాన్స్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.

మిగతా2లో...

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ



2లో

## అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

- సీఎం కుటుంబానికి 308 ఎకరాల భూమి
- కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతామనే మాపై సస్పెన్షన్
- భూభారతి, 22ఏపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54

మిగతా2లో...

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు.ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చల విడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్? ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్?ఎఫ్?ఎస్? దక్కించుకుందని వివరించారు. ఐఎల్?ఎఫ్ఎస్?, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు.మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామనే సభలో లేకుండా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటుకు టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు, తాము టీ షర్టు వేసుకుని అసెంబ్లీకి వస్తే తప్పా? అని ప్రశ్నించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియమాలు వేరా? అని అడిగారు.**పథకం ప్రకారమే గెంటేశారు** వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్, మహిళలకు రూ.2500 ఇవ్వలేదనీ, విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు.ఈ వైఫల్యాలను టీ షర్ట్ మీద రాసుకొస్తే తమను సస్పెండ్ చేశారని అన్నారు. తాము కావాలని అసెంబ్లీ నుంచి బయటకు రాలేదనీ, పక్కా పథకం ప్రకారమే గెంటేశారని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే.. కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ చేశారని అన్నారు. తాము సభలో ఉంటే కాంగ్రెస్ కుంభకోణాలు, రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతి బయటపడుతుందనే భయంతోనే మొత్తం సెషన్‌కి తమను సస్పెండ్ చేశారని వివరించారు. సస్పెన్షన్ ఎత్తేస్తే ఆధారాలతో సభకు వస్తామని తమ ఎమ్మెల్యేలు సవాల్ చేశారని గుర్తు చేశారు. సీపీఐ, బీజేపీలు అడిగినా సస్పెన్షన్ ఎత్తేసే దమ్ము సీఎంకు లేదన్నారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నా మని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్‌పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. చీవీజూ-ుూ పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ+ూ) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ+ూ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు.

కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ - గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అవసరం అయ్యారని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పన్నుల వసూళ్ల రంగానికి దీర్ఘకాలి కంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైనే ప్రతి ఒక్కరూ ప్రధానంగా దృష్టి సారించాలని నిర్మల సీతారామన్ చెప్పారు. పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, వ్యయం వృథా అవుతుందనే వివరాలను గణాంకాలతో సహా నిరూపించాలని కోరారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటో కూడా ప్రతిపాదించాలని, ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేయాలని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. వీటి వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది, పన్ను పరిధి ఏ మేరకు ప్రభావితమవుతుంది, పన్నుల నిర్వహణపై ఎలాంటి ఫలితాలు ఉంటాయనే విషయాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎంతైనా అవసరమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. పన్నుల పరిధిని విస్తృతం చేస్తూనే, విధానపరమైన అడ్డంకులను తొలగించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

(మొదటి పేజీ తరువాయి)

విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరపున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

## తల్లాడలో ఘనంగా నాయీ బ్రాహ్మణ దినోత్సవం



**తల్లాడ/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ టౌన్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నారాయణపురం నుంచి మేళతాళాలు, కోలాటాలు, డీజే పాటలతో మహిళలు, యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. తల్లాడ పట్టణ పురవీధుల్లో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నంద్యాల నరసింహారావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల ఐక్యత, సంక్షేమం, సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంప్రదాయ వృత్తిని పరిరక్షించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు మునుగోటి వెంకటేశ్వర్లు, రావులపాటి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రాచమల్ల అబి, టౌన్ అధ్యక్షుడు రాసమల్ల పెద్దబ్బాయి, కార్యదర్శి రాసమల్ల శివ, కోశాధికారి కన్నెదేవర కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఆర్టీసీ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**
హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట ఆర్టీసీ కాలనీ, పద్మశాలి కాలనీలో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ బలోపేతంతో పరిసరాలు పరిశుభ్రంగా, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్, సారంగపాణి, మూల తిరుపతి, మూల నరోత్తం, వీసం సురేందర్, డబ్బా శ్రీను, భరత్ శ్రీనివాస్‌తో పాటు ఆర్టీసీ కాలనీ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సత్యనారాయణరావు కన్నుమూత

**కేసముద్రం/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు బుధవారం మధ్యాహ్నం అకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతితో వెంకటగిరి గ్రామంతో పాటు కేసముద్రం మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సత్యనారాయణరావు గతంలో కాంట్రాక్టర్‌గా పనిచేసి, అనంతరం వెంకటగిరి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. అనంతరం జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎంపికై ప్రజాప్రతినిధుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.



ఆయన మృతి విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సామాన్యులపై యూపీఐ చార్జీల భారం వద్దు

### సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**హనుమకొండ బ్యూరో/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** యూపీఐ లావాదేవీలపై ఎలాంటి చార్జీలు విధించవద్దని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. హనుమకొండ కాళోజీ సెంటర్‌లో బుధవారం యూపీఐ చార్జీల ప్రతిపాదనకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం, యూపీఐపై చార్జీల భారం మోపేందుకు ప్రయత్నించడం సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు, చిన్న వ్యాపారులపై ప్రభావం చూపుతుందని అన్నారు. కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపారాల్లో జరిగే లావాదేవీలపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. యూపీఐని ఉచితంగా కొనసాగించాలని, చార్జీల ప్రతిపాదనలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.




నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో నాయకత్వ లక్షణాలు

### హసన్‌పర్తిలో 70వ ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా పోటీలు ప్రారంభం





**హసన్‌పర్తి/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** క్రీడలు విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని మండల విద్యాశాఖ అధికారి, ఎస్‌జీఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు ఏ. శ్రీనివాస్ అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. హసన్‌పర్తి మండల స్థాయి 70వ ఎస్‌జీఎఫ్‌ఐ అండర్13, అండర్17 బాలబాలికల క్రీడా పోటీలు బుధవారం స్థానిక జడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికల పాఠశాలల్లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న భారత క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినులు విజయలక్ష్మి, సుమాదేవి, మాజీ కార్పొరేటర్ శివకుమార్, దాత రాము, శోభారాణి, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా బాధ్యులు వాసుదేవరావు, శ్రీధర్, టిజిపేట అధ్యక్షుడు పార్థసారథి, కార్యదర్శి మల్లారెడ్డి, మండల కార్యదర్శి శారద, పీడీలు బాలమురళీకృష్ణ, నవీన్‌కుమార్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటరు జాబితాకు పార్టీల సహకారం

### అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు భద్రపరచాలి: కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.
జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా సుమారు 88,800 మందికి నోటీసులు అందించినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు సూచించిన గుర్తింపు పత్రాలతో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లోని బూత్ స్థాయి అధికారులను సంప్రదించి తమ ఓటు వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.
అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు భద్రపరిచేందుకు ఎన్నికల సంఘం ఇప్పటికే పలుమార్లు అవకాశం కల్పించిందని, ప్రస్తుతం కూడా అవకాశం ఉన్నందున అర్హత కలిగిన వారు తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని



కలెక్టర్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరిపైనా ఓటు తొలగింపు ఉండదని స్పష్టం చేశారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు తరలిన వారు, రెండుచోట్ల ఓటు ఉన్నవారు, మార్పులుచేర్పులు, కొత్త ఓటరు నమోదుకు సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించి నిర్ణీత దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.
రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలపై స్పందించిన కలెక్టర్. బూత్ స్థాయి అధికారుల పారితోషికానికి సంబంధించి చర్యలు తీసుకున్నామని, త్వరలో చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా, నోటిఫికేషన్ తదితర వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.
సమావేశంలో కాంగ్రెస్ నుంచి సురేష్ నాయుడు, బీఆర్‌ఎస్ నుంచి మార్నేని వెంకన్న, బీజేపీ నుంచి శ్యాంసుందర్ శర్మ, టీడీపీ నుంచి పి.బి.రామారావు, బీఎస్పీ నుంచి ఎల్.విజయ్‌కాంత్, సీపీఐ నుంచి విజయ్‌సారథి, మున్సిపల్ కమిషనర్ వినోద్‌కుమార్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏవో పవన్‌కుమార్, తహసీల్దార్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ ఆశీస్సులతో..
# ఆదూరి రవికి కీలక బాధ్యతలు

### తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్‌ఎంఎస్పీ సోషల్ మీడియా అధికార ప్రతినిధిగా నియామకం

**తల్లాడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్‌ఎంఎస్పీ సోషల్ మీడియా అధికార ప్రతినిధిగా ఆదూరి రవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్‌ఎంఎస్పీ ఉద్యమానికి అనుబంధంగా సోషల్ మీడియా రంగంలో ఆదూరి రవి గతంలో నిర్వహించిన కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ వారు అభినందించారు. సామాజిక ఉద్యమ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ఉద్యమ కార్యక్రమాలు, నాయకత్వ సందేశాలను ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించిన ఆయన సేవలను కొనియాడారు.
నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎమ్మార్పీఎస్‌ఎంఎస్పీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. సోషల్ మీడియా వేదికగా ఉద్యమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించి, సామాజిక న్యాయానికి సంబంధించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

### బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల డిమాండ్



**కేసముద్రం/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అధికారులను డిమాండ్ చేశారు. పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతోపాటు డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడం, దోమల ఉధృతి పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి సరఫరాను మెరుగుపరచడంతోపాటు డ్రైనేజీల పూడికతీత, పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కోరారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వినయ్‌రెడ్డి, శరత్‌యాదవ్, రాము, కృష్ణ, సుజాత హరి, శారదా సురేష్, రాజమణి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ దందాకు అడ్డూ అదుపు లేదా..!

**మూడు మండలాల్లో ఆహార భద్రత తనిఖీలు నామమాత్రం**

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారంటూ ఆగ్రహం**

**కేకులు, పాలు, నూనెలు, తాగునీటిపై అనుమానాలు**



**తల్లాడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** వైరా, కల్లూరు, పెనుబల్లి మండలాల పరిధిలో ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు కొరవడటంతో అక్రమాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్న వ్యవహారాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆహార భద్రతా అధికారి అందుబాటులో లేకపోవడం, తనిఖీలు నిర్వహించకపోవడం వల్ల వ్యాపారులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**కేకుల తయారీలో నిబంధనలు పాటిస్తున్నారా?**

బేకరీల్లో తయారు చేస్తున్న కేకులు, ఇతర తినుబండారాల్లో నాణ్యతలేని ముడి పదార్థాలు, అధిక మోతాదులో రంగులు వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై ఆహార భద్రత అధికారులు నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**టీ దుకాణాల్లోనూ నాణ్యతపై అనుమానాలు**

మూడు మండలాల పరిధిలోని టీ దుకాణాల్లో పాలు, ఇతర పదార్థాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా పదార్థాలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదని వినియోగదారులు అంటున్నారు.

**స్వీట్‌షాపులపై ఆరోపణలు**

కొన్ని స్వీట్‌షాపుల్లో నాణ్యత లేని ముడి పదార్థాలను వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేదలకు అందాల్సిన ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా వినియోగిస్తున్నారనే ఫిర్యాదులపైనా సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**వంటనూనె.. తాగునీటిపైనా నిఘా ఏది?**

చిన్న హోటళ్లలో పలుమార్లు వినియోగించిన వంటనూనెను తిరిగి వాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొన్ని నీటి శుద్ధి కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు నమూనాలు సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

**బిల్లుల విషయంలోనూ ఫిర్యాదులు**

కొన్ని వ్యాపార సంస్థలు జీఎస్టీ నిబంధనలు పాటించకుండా బిల్లులు ఇవ్వడం లేదని, వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. దీనిపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కూడా తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి**

ఆహార పదార్థాల నాణ్యతపై వస్తున్న ఫిర్యాదులను ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించాలని ప్రజలు కోరుతున్నారు. వైరా, కల్లూరు, పెనుబల్లి మండలాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి బేకరీలు, హోటళ్లు, టీ దుకాణాలు, స్వీట్‌షాపులు, నీటి శుద్ధి కేంద్రాల్లో నమూనాలు సేకరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# క్రీడల్లో సత్తా చాటాలి

**వేలేరులో 70వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు ప్రారంభం**

**జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి. సర్పంచ్ బిల్లా యాదగిరి**








**వేలేరు/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** వేలేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. ఎస్‌జీఎఫ్ చైర్మన్, ఎంఈఓ చంద్రమౌగిళి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు తరలిరావడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.

**చదువుతోపాటు క్రీడలూ అవసరం**

ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు.

**వేలేరుకు పేరు తీసుకురావాలి**

మండల స్థాయి పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపిక కావాలని, అనంతరం రాష్ట్ర స్థాయిలోనూ రాణించి వేలేరు మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమికి నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో సాధన చేసి విజయాన్ని అందుకోవాలని విద్యార్థులకు సూచించారు.

**క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి**

పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో వ్యవహరించి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. గెలుపు కోసం పోరాడటంతో పాటు ప్రత్యర్థులను గౌరవించడం కూడా క్రీడల్లో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ సత్యం, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోరా దేవి పాదయాత్రకు ఘన స్వాగతం





**నెక్కొండ/సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అజ్మీర మంగ్య తండా నుంచి సెప్టెంబరు 1న ప్రారంభమైన పోరా దేవి మహా పాదయాత్ర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా అజ్మీర మంగ్య తండా సేవాలాల్ ఆలయ చైర్మన్ మూడు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో పోరా దేవి (మహారాష్ట్ర) సేవాలాల్ ఆలయ పీఠాధిపతి బాపుసింగ్ మహారాజ్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ, ప్రస్తుత ఉపసర్పంచులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు అజ్మీర మంగ్య తండా సేవాలాల్ ఆలయంలో బాపుసింగ్ మహారాజ్ చేతుల మీదుగా భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ భరోసా

**లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేసిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్**



**కేసముద్రం/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు అందజేశారు. 2వ వార్డుకు చెందిన బానోత్ యాకమ్మ, చింతనూరి సోమలక్ష్మి, 15వ వార్డుకు చెందిన మచ్చ సంధ్యకు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీ. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బానోత్ విజయ, వేముల భారతి, కనుకుల సుభద్ర, ధారావత్ కిషోర్, వల్లందాస్ ఉమాతో పాటు మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**1,487 మంది విద్యార్థులకు పోషకాహార అల్పాహారం**

**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు, చేనేత కార్మికుల సంక్షేమంతోపాటు రహదారులు, మురికికాలువలు, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,487 మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించే కార్యక్రమం అమలు చేయడం అభినందనీయమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఇడ్లీ, దోశ, పూరీ, ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ వంటి అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థుల్లో ఏకాగ్రత, హాజరు, చురుకుదనం పెరుగుతాయని అన్నారు. సామాజిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచడంతోపాటు రాగిజావ, ఉప్పుమా, పండ్లు తదితర పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఉత్సాహంగా పాఠశాలకు వచ్చి చదువుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ముప్పు శ్రీనివాస్ పేర్కొన్నారు.



# క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి



**తల్లాడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** ఎన్టీఆర్ నగర్‌లో తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) జిల్లా ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు కే.వి. ఇజ్రాయిల్ అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు గుంటి బాబురావు ఆధ్వర్యంలో జరిగింది. టీసీసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ మానుకొండ సుదర్శనం మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవుల శ్మశానవాటికకు మూడు ఎకరాల స్థలం, క్రైస్తవ భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు దాటిన క్రైస్తవులకు వృద్ధాప్య పింఛన్లు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరీక్షణ రావు, రాష్ట్ర కార్యదర్శి ఏసుదాస్, జిల్లా కార్యదర్శి రాజరత్నం, ప్రకాష్‌రావు, రావూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గంట శివలింగయ్య హఠాన్మరణం.

**-నాయకుల నివాళి.**



**బయ్యారం/,సెప్టెంబర్ 16.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన రైతు గంట శివలింగయ్య పొలం పనుల నుంచి వచ్చాక తీవ్ర గుండెపోటుతో మహబూబాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. గత 60 ఏళ్లుగా వ్యవసాయంపైనే ఆధారపడి, కష్టపడి కుటుంబాన్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఆయన మరణం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివాదాలకు దూరంగా, అందరినీ ఆప్యాయంగా పలకరించే ఆయన హఠాన్మరణం గ్రామస్థులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మృతదేహాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య, సహాయ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు భువనగిరి మధు, దొడ్డి తిరుమలేష్, సిపిఐ(ఎంఎల్) డెమోక్రసీ గ్రామ కమిటీ నాయకులు సందర్శించి అశ్రునయనాల మధ్య నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన లావణ్యకు ఘన సన్మానం

### బ్రాహ్మణపల్లి గ్రామానికి పేరు తెచ్చిన విద్యార్థినికి అభినందనలు



**వైరా/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పంతగాని నాగమణి కుమార్తె పంతగాని లావణ్య నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఎండీ బిషప్ సుదర్శన్ లావణ్యను శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి అభినందించారు. వైద్య విద్యలో సీటు సాధించి గ్రామానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకొచ్చిన లావణ్యను ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు.విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. లావణ్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి సమాజానికి సేవ చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గుంటి బాబురావు దంపతులు, కె.వి. ఇజ్రాయిల్, సంఘ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొని లావణ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

## గణేష్ ఉత్సవ కమిటీలకు రూ.5,116

### బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో విరాళాలు



**మిర్యాలగూడ/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న ప్రతి కమిటీకి రూ.5,116 చొప్పున విరాళం అందించనున్నట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) తెలిపారు. బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు దామరచర్ల మండలంలోని రాజగట్టు కాపురాతండా లంబోదర కమిటీ, శాంతినగర్ సర్వాయి సర్దార్ పాపన్న కమిటీ, మోదుగులకుంట తండా ఆర్అండ్ఆర్ కాలనీ కమిటీ, కాపురాతండా ఆర్అండ్ఆర్ కాలనీ కమిటీలకు రూ.5,116 చొప్పున విరాళాలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొర్ర నాగునాయక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నందిని రవితేజ, మాలోతు శివకుమార్, ధనావత్ కిషన్ నాయక్, కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రతినిధి శివచరణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బుధవారం వారపు సంతను సద్వినియోగం చేసుకోవాలి.

### -సర్పంచ్ శాంతి కిషన్ నాయక్.



**బయ్యారం/,సెప్టెంబర్ 16.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మేజర్ గ్రామపంచాయతిలో గాంధీ సెంటర్ వద్దగల తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఇకపై ప్రతి బుధవారం క్రమం తప్పకుండా వారపు సంత నిర్వహించనున్నట్లు బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ వెల్లడించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నివాసితులకు అవసరమైన తాజా కూరగాయలు, నిత్యావసర వస్తువులు ఒకే చోట అందుబాటులో ఉండేలా ఈ సంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా వారపు సంతలోనే కొనుగోళ్లు జరిపి, స్థానిక చిన్న వ్యాపారులకు ఆసరాగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా,నాయిని శ్రీనివాస్ రెడ్డి, భద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం మండలంలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై రెవెన్యూ శాఖ కీలక మార్గదర్శకాలు.

**బయ్యారం/,సెప్టెంబర్ 16.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా,భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలను తహసీల్దార్ సప్పిడి నాగరాజు విడుదల చేశారు.రోడ్లు,వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలి.విద్యుత్ భద్రత విషయంలో లైసెన్స్ పొందిన వైరింగ్ మాత్రమే వాడాలి.అగ్నిప్రమాదాల నివారణకు నీరు,అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.రాత్రి వేళల్లో వెలుతురు 24/7 స్వచ్ఛంద సేవకులు ఉండాలి.మైకులను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వాడాలి.వృద్ధులు,విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదు.మద్యం,మత్తు పదార్థాలకు తావులేకుండా చూడాలి. అనుమానాస్పద వ్యక్తులు,వస్తువులు కనిపిస్తే వెంటనే 100/112 లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.మండపాల వద్ద ప్లాస్టిక్ వాడకం తగ్గించి పారిశుద్ధ్యాన్ని పాటించాలి.నిమజ్జనం వేళ చెత్తను నీటిలో వేయకూడదు.నిమజ్జన సమయంలో నీటి ప్రమాదాలు జరగకుండా చూడాలి.చిన్న పిల్లలను నీటి దరిదాపుల్లోకి రానివ్వకూడదు.భక్తితో ఉత్సవం బాధ్యతతో నిర్వహణ ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత అనే సూత్రంతో గ్రామ పంచాయతీ, పోలీస్,విద్యుత్ శాఖల నిబంధనలను పాటించాలని భక్తులకు తహసీల్దార్ నాగరాజు సూచించారు.

# డీజే దరువు.. హద్దులు దాటొద్దు

### నిమజ్జన వేడుకల్లో నిబంధనలు పాటించాలి.- సీఐ విశ్వేశ్వర్



**గీసుకొండ/ సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ వార్త):**



గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ సూచించారు. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా డీజే ఆపరేటర్లు, సౌండ్ సిస్టమ్ నిర్వాహకులకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అధిక శబ్దంతో డీజేలు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. న్యాయస్థానాల ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.నిమజ్జన ఉత్సవాలు సజావుగా సాగేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఐ విశ్వేశ్వర్ సూచించారు.

## పిఆర్టీయు మండల అధ్యక్షుడి తండ్రిని పరామర్శించిన పిఆర్ టీయు జిల్లా అధ్యక్షుడు.



**బయ్యారం/,సెప్టెంబర్ 16.(జర్నలిస్ట్ వార్త)**
పిఆర్టియు టిఎస్ బయ్యారం మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ తండ్రి భీమ్లా నాయక్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని,పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షుడు మిరియాల సతీష్ రెడ్డి, ఏఎమ్ఓ వెంకటేశ్వర్లు ఆయనను పరామర్శించారు.వారితో పాటు సంఘ నాయకులు భీమ్లా నాయక్ స్వగ్రామమైన సింగారం వెళ్ళి, ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు.ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు బయ్యారం మండల ప్రధాన కార్యదర్శి నీలం శ్రీనివాస్,మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భూములు పోయాయి.. ఉద్యోగాలు ఇవ్వండి

### వైటీపీఎస్ ఎన్‌క్రోచ్‌మెంట్ భూ బాధితుల విజ్ఞప్తి



**దామరచర్ల/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):**
వైటీపీఎస్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన తమ కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని భూ బాధితులు మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయి ఏళ్లుగా ఉపాధి సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆయనకు వివరించారు.భూములు కోల్పోయిన కుటుంబాల్లో అర్హత ఉన్న వారికి ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. తమ భూములు ప్రాజెక్టు అవసరాలకు వినియోగించినప్పటికీ కుటుంబాలకు తగిన ఉపాధి అవకాశాలు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు కల్పిస్తే తమ కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కలుగుతుందని తెలిపారు.బాధితుల సమస్యలను జానారెడ్డి సానుకూలంగా విని, సమస్య పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన భూ బాధిత కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు కోరారు.

## నేడు మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### -బీజేపీ జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాసరావు.

**బయ్యారం/,సెప్టెంబర్ 16.**
**(జర్నలిస్ట్ వార్త)**



ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని నేటి నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాసరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మోదీ పుట్టినరోజైన సెప్టెంబర్ 17న 'సేవా దివస్'గా పరిగణిస్తూ విస్తృత స్థాయిలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.అంతేకాకుండా నేటి సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల మధ్య ప్రజలు,ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ ఇళ్లలో 'ఆశీర్వాద కా దీపం' పేరిట ప్రమిదలు వెలిగించి ప్రధాని మోదీకి ఆశీస్సులు అందజేయాలని తుమ్మల పిలుపునిచ్చారు.ఈ సేవా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# అప్రమత్తతే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

### పిల్లల చేతుల్లో వాహనం.. మాదకద్రవ్యాలపై తల్లిదండ్రుల నిఘా అవసరం -వర్ధన్నపేట ఎస్సై రాజు






**వర్ధన్నపేట/ సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ వార్త):**

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఎస్సై రాజు సూచించారు. బుధవారం వర్ధన్నపేట బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులతో మాట్లాడిన ఆయన సైబర్ మోసాలు, మాదకద్రవ్యాలు, మైనర్ల వాహనాల నడిపింపుపై అవగాహన కల్పించారు.ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సూచించారు. అత్యవసరమని చెప్పినా వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వంటి వివరాలను ఎవరికీ చెప్పవద్దని తెలిపారు. కుటుంబ సభ్యులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు. పిల్లలు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లల స్నేహాలు, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని అన్నారు. చిన్నపిల్లల చేత వాహనాలు నడిపించడం ప్రమాదకరమని, అలా చేయడం వల్ల వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చట్టానికి విరుద్ధమైన పనులకు దూరంగా ఉండాలని, ఎలాంటి నేరానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజలు అప్రమత్తంగా ఉండటం, తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపడం, చట్టాలను పాటించడం ద్వారా అనేక నేరాలు, ప్రమాదాలను ముందుగానే నివారించవచ్చని ఎస్సై రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొని ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

ఆమ్ముక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక


# చికిత్స జాప్యంపై నలుగురికి మెమోలు

## 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆసుపత్రి ఆదేశం
## జర్నలిస్ట్ వార్త కథనంపై అధికారుల స్పందన.. క్రమశిక్షణ చర్యలపై హెచ్చరిక



OFFICE OF THE MEDICAL SUPERINTENDENT: AREA HOSPITAL: WARDHANNAPET

Rc.No.E1/General /Memo/2026 Dt.16.09.2026

MEMO

Sub: TVVP- Area Hospital Wardhannapet - Smt.I.Saraswathi, W/o.Mahendhar R/o. Perikedu, Raiparthy, Warangal District - Admitted with complaint of Fever on 16.09.2026 - Talking rude to the patient attendants - Memo issued to Concerned staff - Explanation called for - Reg.

Ref:- Journalist Vartha news on social media, Dt.16.09.2026.

@@@

It came to notice of the undersigned that, a patient named Smt. I.Saraswathi Age 25years W/o Mahendhar R/o Perikedu, Raiparthy, Warangal District was admitted with I.P. No. 5835 on 16.09.2026 at 1.30.PM with the complaint of Fever.

It further noticed that in the Journalist Vartha news on social media, Dt.16.09.2026 according to the news the patient attendance complaints that they did not attend the treatment for 20 minutes and handed over the case sheets to register at O.P. for I.P. number and send to the ward. A duty Doctor and the duty sister has rudely talked to the patient attendants. Its shows gross negligence in attending their duties and causing a lot of inconvience to the administration.

Hence, in view of above, the following officers of this hospital are here by instructed to submit their explanation within (24) hours from the date of receipt of this memo on above case and explain reasons why disciplinary action could not be taken/recommend to higher authorities.

| SI.NO | Name of the Staff | Designation |
|---|---|---|
| 01. | Dr.K.Rajesh | CAS (Anes.,) |
| 02. | K.Vijaya | Staff nurse |
| 03. | M.Yakalakshmi | Staff nurse |
| 04. | Ch.Manjula | ANM |

Medical Superintendent,
Area Hospital, Wardhannapet.

Copy to the above individuals.
Copy Submitted to the Superintendent, District Head Quarter Hospitals, Warangal District for information.
Copy Submitted to the Collector & District Magistrate, Warangal District for kind information.
Copy to office file.







**వర్ధన్నపేట/సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ వార్త):** రోగికి చికిత్స ఆలస్యం, రోగి సహాయకులతో సిబ్బంది దురుసు ప్రవర్తనపై జర్నలిస్ట్ వార్తలో ప్రచురితమైన కథనంపై వర్ధన్నపేట ప్రాంతీయ ఆసుపత్రి అధికారులు స్పందించారు. ఘటనకు సంబంధించి నలుగురు సిబ్బందికి మెమోలు జారీ చేసి. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

సెప్టెంబరు 16న మధ్యాహ్నం 1.30 గంటలకు ఐపీ నంబర్ 5835తో ఆసుపత్రిలో ఓ మహిళ పేషెంట్ చేరినట్లు అధికారిక మెమోలో పేర్కొన్నారు. రోగికి సుమారు 20 నిమిషాలపాటు చికిత్స అందలేదని, కేస్‌షీట్‌ను ఓపీ వద్ద నమోదు చేసి వార్డుకు పంపించారని రోగి సహాయకులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జర్నలిస్ట్ వార్త కథనం ప్రచురించింది.

ఈ నేపథ్యంలో డ్యూటీ వైద్యుడు, స్టాఫ్ నర్సులు మెడికల్ సూపరింటెండెంట్ మెమోలు జారీ చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగిందా? రోగికి సకాలంలో వైద్యం అందించడంలో జాప్యం జరిగిందా? రోగి సహాయకులతో దురుసుగా వ్యవహరించారా? అనే అంశాలపై వివరణ కోరారు. మెమో అందిన 24 గంటల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో, ఉన్నతాధికారులకు ఎందుకు సిఫారసు చేయకూడదో కారణాలు వెల్లడించాలని స్పష్టం చేశారు. మెమో ప్రతులను వరంగల్ జిల్లా ప్రధాన ఆసుపత్రుల సూపరింటెండెంట్‌తో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు. జర్నలిస్ట్ వార్త కథనంపై ఆసుపత్రి యాజమాన్యం స్పందించి నలుగురు సిబ్బందికి మెమోలు జారీ చేయడంతో తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. సిబ్బంది వివరణ ఆధారంగా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సి ఉంది.

# ప్రతి దశలోనూ.. రోగి భద్రత

### ఎన్‌సీడీ ద్వారా వ్యాధుల గుర్తింపు.. 'సంజీవని'తో నిరంతర వైద్యం

### మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలకు ప్రాధాన్యం

### సెప్టెంబరు 17న ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం -మంత్రి సత్యకుమార్ వెల్లడి




**అమరావతి,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** రోగికి వైద్యం అందించడం ఎంత ముఖ్యమో.. ఆ వైద్యం వల్ల ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం, మందులను సురక్షితంగా వినియోగించడం, చికిత్స అనంతరం రోగి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం ద్వారా రోగి భద్రతను బలోపేతం చేయాలన్నారు. ఎన్‌సీడీ 4.0లో ఇప్పటికే 2.83 కోట్ల మందికి పైగా పరీక్షలు నిర్వహించగా.. 59.38 లక్షల మందిలో అధిక రక్తపోటు, 48.32 లక్షల మందిలో మధుమేహం గుర్తించినట్లు తెలిపారు. వ్యాధి గుర్తించిన వారికి సకాలంలో వైద్యం అందేలా 'సంజీవని' ద్వారా సేవలను అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబర్ 17 ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా మంత్రి బుధవారం ప్రకటన విడుదల చేశారు.

రక్తపోటు, మధుమేహంతో పాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారికి ఎన్‌సీడీ 4.0 ద్వారా విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. క్యాన్సర్ పరీక్షల్లో అనుమానం ఉన్న వారిని తదుపరి పరీక్షలు, అవసరమైన చికిత్స కోసం పంపిస్తున్నామని చెప్పారు. వ్యాధి గుర్తించిన తర్వాత వైద్యం అందడంలో జాప్యం లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్షల్లో వ్యాధి ఉన్నట్లు తేలిన తర్వాత రోగికి తదుపరి వైద్యం అందడంలో ఎలాంటి అంతరాయం ఉండకూడదన్నారు. 'సంజీవని' ద్వారా పరీక్షలు, చికిత్స, మందులు, తదుపరి పర్యవేక్షణ వంటి సేవలను అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా వైద్యం పొందేలా సేవలను కొనసాగించాలని సూచించారు. ప్రతి రోగి ఆరోగ్య వివరాలను డిజిటలీకరణ చేస్తున్నామని తెలిపారు. సంజీవని ద్వారా రోగులకు ఆరోగ్య భద్రత మరినీత పెరుగుతుందని చెప్పారు. రోగికి అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందడం చికిత్సలో కీలకమన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా రోగులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రోగులు తాము గతంలో తీసుకున్న చికిత్స, ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని, సొంతంగా మందుల మోతాదును మార్చడం లేదా నిలిపివేయడం చేయకూడదని తెలిపారు.

# ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

### భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

### రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం

### భక్తుల సౌకర్యార్థం 32 ఈవీ బస్సులు అందించిన రిలయన్స్, భారత్ బయోటెక్

### తిరుమల వచ్చే భక్తులకు ఎల్ఐసీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల బీమా

### రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం

### - సీఎం చంద్రబాబు



**తిరుమల,సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రవ, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సీఎం ఆసక్తిగా పరిశీలించారు.

# బయ్యారం గ్రామపంచాయతిలో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం.

### -నూతన బోర్ వెల్‌కు సర్పంచ్ శంకుస్థాపన.



**బయ్యారం/,సెప్టెంబర్ 16.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రంగాపురం వాటర్ ట్యాంక్ ద్వారా ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం నూతన బోర్ వెల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.గ్రామపంచాయతీ నిధులతో ఈ పనులను చేపడుతున్నాట్లు సర్పంచ్ తెలిపారు.రంగాపురం వాటర్ ట్యాంక్‌కు ఇప్పటివరకు కేవలం మిషన్ భగీరథ కనెక్షన్ మాత్రమే ఆధారంగా ఉండేది. ప్రత్యామ్నాయ నీటి వనరులు ఏవీ లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన సర్పంచ్ శాంతి కిషన్ నాయక్,తక్షణమే స్పందించి నూతన బోర్ వేయించేందుకు శ్రీకారం చుట్టారు.గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా సమయానుకూలంగా చర్యలు తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్, పాలకవర్గానికి రంగాపురం గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు,వార్డు మెంబర్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# సుద్దరేవు పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లు,బ్యాగ్‌లు పంపిణీ.

**బయ్యారం/,సెప్టెంబర్ 16.(జర్నలిస్ట్ వార్త)**


తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ అనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "రైజింగ్ తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా కోయగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సుద్దరేవు పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లు, స్కూల్ బ్యాగ్‌లు,ఐడీ కార్డులు,బెల్ట్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కోయగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ లింగనాయక్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు స్వయంగా ఈ సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ లింగనాయక్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, వారి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, షూస్, టై, బెల్ట్ మరియు బ్యాగ్‌లను అందిస్తున్న ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి కోయగూడెం గ్రామపంచాయతీ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాదావత్ రాంబాబు,రమేష్,గ్రామ ప్రముఖులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వం విద్యారంగానికి అందిస్తున్న ఈ సహాయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# అంబేద్కర్‌పై పుస్తకం.. విడుదల నిలిపివేయాలి

### హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి. -విల్సన్ మాదిగ

**హైదరాబాద్/సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ వార్త):**


డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా, విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆరోపిస్తూ హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేరిపోతుల విల్సన్ మాదిగ డిమాండ్ చేశారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చిటుపాక ప్రభాకర్ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం ఆయన ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.హమారా ప్రసాద్ రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పిత నాయకుడు పుస్తక ప్రచురణను నిలిపివేయాలని కోరారు. అంబేద్కర్‌పై గౌరవం, చిత్తశుద్ధి ఉంటే హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీని డిమాండ్ చేశారు.అంబేద్కర్‌ను అవమానించే లేదా కించపరిచే వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబరు 18న పుస్తకాన్ని విడుదల చేయనున్న నేపథ్యంలో దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు స్పందించి పుస్తక విడుదలను అడ్డుకోవాలని, చట్టప్రకారం చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విల్సన్ మాదిగ కోరారు.

# జ్వరంతో రోగికి 20 నిమిషాల నిరీక్షణ



**వర్ధన్నపేట/సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ వార్త):** జ్వరంతో చికిత్స కోసం వచ్చిన రాయపర్తి మండలానికి చెందిన ఓ రోగికి వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 20 నిమిషాలపాటు వైద్యం అందలేదని బంధువులు ఆరోపించారు. కేస్‌షీట్ ఇచ్చి ముందుగా నంబర్ వేయించుకుని రావాలని సిబ్బంది సూచించారని, అనంతరం పైనికి వెళ్లండి అని చెప్పారని తెలిపారు. రోగి వైద్యం కోసం ఎదురుచూస్తున్న సమయంలో చికిత్సతో పాటు జూనియర్ వైద్యులతో మాట్లాడటం ముఖ్యమని ఓ వైద్యుడు చెప్పినట్లు బంధువులు పేర్కొన్నారు. ఘటనపై ఆసుపత్రి అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.